క్లుప్తంగా

లోన్ యాప్‌లతో జీవితాలు నాశనం

బి.కొత్తకోట : స్మార్ట్ ఫోన్ల ద్వారా లోన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకుంటే జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఐ రామమోహన్ హెచ్చరించారు. మంగళవారం బి.కొత్తకోటలో ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించి లోన్‌యాప్‌లపై అవగాహన కల్పించారు. పది నిమిషాల్లో రుణాలు ఇస్తామని నమ్మిస్తారని, రుణం తీసుకొన్నాక బయట పడటం కష్టమని, ఇలాంటి బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సప్‌లకు వచ్చే లింకులపైనా క్లిక్ చేయవద్దని, ఇవ్వన్నీ మోసగాళ్ల పంపే లింకులని చెప్పారు. బాధితులు తక్షణ సహాయం కోసం హెల్ప్‌లైన్ 1930 లేదా నేర విభాగం సీఐ 9121100658 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పీలేరు : పట్టణంలోని స్థానిక ఎస్వీ డీలక్స్ థియేటర్ ప్రాంగణంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్లాటినమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం నారాయణ హృదయాలయ బెంగళూరు వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి గుండెకు సంబంధించి 2డీ ఏకో పరీక్షలు ఉచితంగా నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ అధ్యక్షులు వేణుగోపాల్, ట్రెజరర్ షఫీ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు

బి.కొత్తకోట : స్థానిక ఆలేటివారిపల్లె సమీపంలోని దేవదాయశాఖ భూముల్లో అక్రమంగా ఇసుక తరలింపుపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ రామమోహన్ తెలిపారు. దేవదాయ భూముల్లో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తవ్వి తరలించుకొంటున్నారని అధికారులు ఫిర్యాదులు చేయగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. బి.కొత్తకోట, బాలసానివారిపల్లెకు చెందిన రెండు ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని యజమానులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

తంబళ్లపల్లె : మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో కోడిపందేలు, పేకాట, జూదం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సంక్రాంతి పేరుతో జూదాలు ఆడితే కఠిన చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికలను గమనించాలన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా వైవి.శివ

పెద్దతిప్పసముద్రం : నియోజకవర్గ బహుజన సమాజ పార్టీ (బీఎస్పీ) ఉపాధ్యక్షుడిగా పెద్దతిప్పసముద్రంకు చెందిన వైవి. శివ నియమితులయ్యారు. బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి బాలాజీ సమక్షంలో మంగళవారం మదనపల్లిలో శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ ఎన్నికలో ప్రసాద్, రమణ, నరసింహులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరించిన కలెక్టర్ గిరీషా

పీలేరు రూరల్ : ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (ఏపీవీడబ్ల్యూఎస్ఈఏ) ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ గిరీషా చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్‌బాషా, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, వైస్‌ప్రెసిడెంట్‌లు రెడ్డిఅహ్మద్, అంజయ్య, శివప్రసాద్‌రాజు, ట్రెజరర్ పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు గంగాధర్, వెంకటరమణ నరేష్, రేనిస్, మనోహార్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పరోళ్ళపల్లిలో వివాదాస్పదంగా మారిన మురుగు నీటి కాలువ సమస్యను మంగళవారం ఎట్టకేలకు అధికారులు పరిష్కరించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ మహమూద్, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డితో పాటు పంచాయతీకి చెందిన నాయకులు గ్రామస్తులతో మమేకమై సమస్యను పరిష్కరించి అనంతరం డ్రైనేజీ పనులను ప్రారంభించారు.

80 మంది బైండోవర్

మదనపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, అక్రమ సారా, కర్ణాటక మద్యం విక్రయాలు చేయడంలో నేరచరిత్ర కలిగిన 80 మందిని బైండోవర్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ, ఎస్ఐ చంద్రశేఖర్, సుధాకర్ తెలిపారు. మంగళవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సీకే. శ్రీనివాసులు సమక్షంలో బైండోవర్ చేశారు. సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన

- వంద శాతం హామీలు అమలు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



గడ్డురాజులపల్లెలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : పేదల సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం కురవపల్లి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా కురవపల్లి, చిన్నమొరవపల్లి, గడ్డురాజులపల్లె, చంద్రరాజులపల్లె, ఎండపల్లి, కొండ్లపల్లి, బీధులపల్లి, నాయనవారిపల్లి, గుట్టకిందపల్లె, మళిగివారిపల్లెలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా అక్కడికక్కడే పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు.

వందశాతం హామీలు అమలు

గత టీడీపీ ప్రభుత్వం పూర్తి రుణమాఫీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టులో పెట్టి అధికారంలోకి వచ్చాక రుణమాఫీ ఊసే ఎత్తలేదని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ కార్యకర్తలకు మాత్రం పక్కాగృహాలు మంజూరు చేశారని, పేదలను గాలికివదిలేశారన్నారు. హామీలు నెరవేర్చని టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలే గద్దెదింపారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇంటి వద్దకే సచివాలయ పాలన, నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ, పేద విద్యార్థుల కోసం అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఘన విజయం కట్టబెట్టనున్నారని, సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

డయాలసిస్ సోకిన యువతికి ఆర్థిక సహాయం

కొండ్లపల్లెకు చెందిన చీరంగి రమణమ్మ గత కొన్ని నెలలుగా డయాలసిస్ వ్యాధితో బాధపడుతోంది. డయాలసిస్ బాధితురాలి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి ఆముదాల మదుసూదన్‌రెడ్డి, సర్పంచు క్రిష్ణప్ప, విష్ణు, ఎంపీటీసీ సుధాకర్‌నాయుడు, మార్కెట్ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచు కేశవరెడ్డి, నాయకులు వై.రవిశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సురేంద్రగౌడ్, బయ్యారెడ్డి, రామిరెడ్డి, హరిగౌడ్, జీకే శ్రీనివాసులు, విశ్వనాథ్, మల్లికార్జునరెడ్డి, చాంద్‌బాషా, రఫీ, అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- 28వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ఇంటింటికీ సంక్షేమ ఫలాలను అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మున్సిపాలిటీలోని 28వవార్డు దొంతి లేఅవుట్ సచివాలయ పరిధిలో కౌన్సిలర్ షేక్ వసీంఅక్రం ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్ షేక్ వసీంఅక్రంతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ మూడున్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపర్చడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల కాలంలో మేనిఫెస్టోలోని హామీలను 98శాతానికి పైగా నెరవేర్చామన్నారు. దేశంలోనే ఆదర్శ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు అందుకుంటుంటే రాష్ట్రంలోని ప్రతిపక్షనేతలకు ఏమాత్రం రుచించడం లేదన్నారు. చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినప్పటికీ ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో ఆయనకు రాజకీయ సన్యాసం తప్పదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, డిష్ రామకృష్ణారెడ్డి, రామిశెట్టిశివయ్య, ఎస్.కరీముల్లా, కోఆప్షన్ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, బాలగంగాధరరెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.90 లక్షల నిధులతో మసీదుల అభివృద్ధి

ఎంపీ పీవీ మిథున్ రెడ్డి వెల్లడి



ముస్లింలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ పీవీ మిథున్ రెడ్డి

కలికిరి : మండల పరిధిలో రూ.90 లక్షల నిధులతో మసీదులను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి మసీదులను సందర్శించి ఆయా కమిటీలతో ఎంపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేవుడిచ్చిన అవకాశంతోనే ప్రజాసేవ చేయడం జరుగుతోందన్నారు. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మసీదుల అభివృద్ధి తన సొంత నిధుల నుంచి రూ.90 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఇటీవలే కోడూరు, రాజంపేట, రాయచోటి ప్రాంతాల్లో నూతన ఈద్గాల ఏర్పాటుకు నిధులు కేటాయించడంతో పాటు మసీదుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కలికిరిలోనూ నూతన ఈద్గా ఏర్పాటుకు సొంత నిధులతో స్థలం ఏర్పాటు, నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, అలాగే తొమ్మిది మసీదుల అభివృద్ధికి రూ.46 లక్షలు కేటాయించామన్నారు. ఆయా మసీదుల కమిటీలో నిర్ణయం తీసుకుని మసీదుల అభివృద్ధి చేపట్టాలని సూచించారు. త్వరలో వాల్మీకిపురం మండలంలోనూ మసీదుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు మునుపు నూతన ఈద్గా ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా, మైనారిటీ నేతలు ఆఫామొహిద్దీన్, ఖాన్ ఖలీల్, బావాజీ, ఖాదర్ వల్లి, ఖాదర్ బాషా, ఆయా మసీదుల ముతవల్లీలు, మత పెద్దలు పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ

కలికిరి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని రాజంపేట ఎంపీ, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం మండల పర్యటనకు విచ్చేసిన వారు విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన వారికి మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

మండల పరిధిలోని మర్రికుంటపల్లి గ్రామం కొత్తగజ్జలవారిపల్లికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు మంగళవారం ఎంపీ పీవీ మిథున్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ సూచించారు. టీడీపీ సీనియర్ కార్యకర్త మురాషా, జాకీర్, నసీబ్, జగన్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పిస్తాం

గ్రామసభలో తహసిల్దార్ ధనుంజయులు



మాట్లాడుతున్న తహసీల్దార్ ధనుంజయులు

బి.కొత్తకోట : కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ ముంపు ప్రాంతంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి పునరావాసం కల్పించి ప్రభుత్వం ఆదుకుంటుందని తహసీల్దార్ ధనుంజయులు చెప్పారు. మంగళవారం మండలంలోని చౌటకుంటపల్లెలో నిర్వాసితులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ఆర్అండ్ఆర్‌ను అమలు చేస్తున్నట్టు చెప్పారు. దీనికోసం గ్రామంలోని ప్రతి ఇంటి ఆర్థిక, సామాజిక పరిస్థితులపై సర్వే నిర్వహించామని చెప్పి, కుటుంబం వారీగా వివరాలను చదివి వినిపించారు. ఇందులో ఒక అభ్యంతరాన్ని నమోదు చేశారు. బాధితుల పునరావాసం కోసం ఒక్కో ఇంటికి ఐదు సెంట్ల స్థలం ఇస్తామని, అదే ఇంటిలో 18 ఏళ్లు నిండిన వారికి అదనంగా మరో ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామన్నారు. డీటీలు విజయకుమార్, లక్ష్మయ్య, ఆర్ఐ రూపేష్, సర్పంచులు సాంబశివ, ప్రమీల, వీఆర్ఓ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నాయకురోళ్ల చెరువుకు నీరు మళ్లింపు

పీలేరు రూరల్ : మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ బెస్తపల్లె సమీపంలోని నాయకురోళ్లచెరువుకు గార్గేయ నది నుంచి నీరు మళ్లించారు. ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మండల నిధులతో సుమారు 3.5 కిలోమీటర్ల మేరకు పెద్దకాలువ పూడికతీత పనులు చేపట్టి నీరు చెరువుకు మళ్లించినట్లు తెలిపారు. చెరువు కింద దాదాపు వంద ఎకరాలు ఆయకట్టు ఉందని, రైతులకు పొలాలకు నీరు లభిస్తుందని చెప్పారు. బోర్లలో నీటి మట్టం పెరుగుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నారే వెంకటరమణారెడ్డి, కరీముల్లా, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృక్ష సంపదను సంరక్షించాలి

డ్వామా పీడీ మద్దిలేటి



గ్రామస్థులతో మట్లాడుతున్న పీడీ మద్దిలేటి

పెద్దమండ్యం : ఉపాధిహామీ పథకం ద్వారా బంజరు భూముల్లో చేపట్టిన వృక్ష సంపదను సంరక్షించాలని జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. మండలంలోని గుర్రంవాడ్లపల్లె పంచాయతీలోని గుట్టకిందతండాకు సమీపంలోని వృక్ష పెంపకం దారుల సహకార సంఘం ద్వారా బంజరు భూముల్లో చేపట్టిన మొక్కల పెంపకం, అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామానికి సమీపంలో ఎఫ్ఈఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బంజరు భూమి కాకులకోనగుట్టలో చేపట్టిన పనులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. బంజరు భూముల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా మొక్కల పెంపకంతో బాటు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అటవీ సంపదను సంరక్షించుకోవడంలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వృక్ష సంపదను సంరక్షించడంలో గ్రామస్థులు తీసుకున్న చొరవ పట్ల ప్రశంసించారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో వార్షిక ప్రణాళిక తయారీలో ఎఫ్ఈఎస్ సంస్థ వారు రూపొందించిన యాప్‌పై ఉపాధి, ఎఫ్ఈఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా సిబ్బంది తమకు నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఏపీఓ మురళి, ఎఫ్ఈఎస్ రీజనల్ టీం లీడర్ భక్తర్‌వలీ, ఏరియా కో ఆర్డినేటర్ రమేష్‌బాబు, టెక్నికల్ అసిస్టెంట్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : మండలంలోని బోడుమల్లువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మంగళవారం తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు బరువు, ఎత్తు, రక్తహీనత, చెవి, దంత, ముక్కు, వినికిడి తదితర శారీరక సామర్థ్యాలు పరిశీలించి వివరాలు సంబంధిత యాప్ ద్వారా ఉన్నతిస్థాయి అధికారుల పర్యవేక్షణ నిమిత్తం నమోదు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి ఉన్నతి విద్యా సాధనకు లోపంలేని శారీరక అభివృద్ధి, సంపూర్ణ ఆరోగ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రమణ్యం, హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎంలు రాజేశ్వరి, రేణుక, సుధా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రామసముద్రం : మండలంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఎక్కడైనా కోడి పందాలు, పేకాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ రవీంద్రబాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో పేకాటలు, కోడిపందాలు ఆడిన జూదరులను రామసముద్రం తహసీల్దార్ శాస్త్రీకి బైండోవర్ చేసినట్లు తెలిపారు. అలాగే రామసముద్రం టౌన్ పరిధిలో ట్రాఫిక్ చర్యలో భాగంగా కొన్ని సూచనలు ఇచ్చారు. దుకాణాదారులు తమ అంగళ్లకు వ్యాపార నిమిత్తం వచ్చే వాహనదారులకు తెలియచెప్పి ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలను పెట్టించాలన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

మదనపల్లె సిటీ : పట్టణంలోని దివ్యాంగుల కాలనీలో మంగళవారం యాచకులకు దుప్పట్లను మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి అందజేశారు. చలికాలం కావడంతో యాచకులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుండటంతో రేఖా గార్మెంట్స్ నిర్వాహకులు బెడ్ షీట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రేఖా గార్మెంట్స్ నిర్వాహకులు బోగాలాల్,అర్జున్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కౌడిన్య స్కాలర్ షిప్‌కు ఎంపిక



డాక్టర్ ఇవి నారాయణ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న సందీప్‌కుమార్

కలకడ : కౌడిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్ షిప్‌కు అన్నమయ్య జిల్లాలో ఒకే ఒక విద్యార్థి ఎంపికైనట్లు ఎంఈఓ మునీంద్రనాయక్ తెలిపారు. కలకడ మండలం కదిరాయచెర్వు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన గౌరవం నాగమణి , చలమయ్యగౌడ్ దంపతుల కుమారుడు సందీప్‌కుమార్‌కు సోమవారం రాత్రి గుంటూరులో స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. డాక్టర్ ఇవి నారాయణ చేతుల మీదుగా ప్రశంస పత్రంతో పాటు రూ.5,116 నగదును అందజేశారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి

ఉపవిద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప




మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప

వాల్మీకిపురం : పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లి ఉప విద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప అన్నారు. మంగళవారం మండలంలోని మంచూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. నాడు–నేడు ఫేస్–2 నిర్మాణం నాణ్యతగా ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ–1 పరీక్షను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో క్షయ నివారణ సాధ్యం

మదనపల్లె : పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని మెడికల్ సూపరింటెండెంట్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో క్షయ విభాగంలో చికిత్సలు పొందుతున్న బాధితులకు ఆస్పత్రి వైద్యులతో కలిసి పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు డాక్టర్ల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాతలు డాక్టర్ హరిజయకృష్ణ, రవిచంద్రారెడ్డి, వెంకటరమణ, ఫార్మసిస్ట్ ఉమాదేవి, వైద్యులు నిహారిక, శ్రీనివాసులు, బాలరంగడు, సల్మా, కరుణాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సందడిగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగిమంటలు ముందు విద్యార్థులు, అధ్యాపకులు

మదనపల్లె సిటీ: విద్యార్థుల ఆటపాటలు, కేరింతలతో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో సందడి వాతావరణం నెలకొంది. మంగళవారం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కాలేజీ పండుగ పల్లె వాతావరణం నెలకొంది. అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. ముగ్గుల పోటీలు, మెహందీ,వంటల పోటీలు నిర్వహించారు. కాలేజీ ఆవరణంలో విద్యార్థినులు రంగుల ముగ్గులు వేశారు. కాలేజీ మైదానమంతా ముగ్గులతో నిండిపోయి అందంగా మారిపోయింది. విద్యార్థులు భోగిమంటలు వేశారు. సంప్రదాయబద్ధంగా విద్యార్థులు, అధ్యాపకులు భోగిమంటలు వేసి చుట్టూ కోలాటం చేశారు. వివిధ రకాల వంటకాలు చేశారు. విద్యార్థులు మెహందీ వేసుకున్నారు. హరిదాసు కీర్తనలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణీయగా నిలిచాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు మోహన్‌వల్లి, విష్ణుప్రియ, హాజీరాఖానమ్, నమ్రత,జ్యోతి, భవానీ, వనజ,ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : స్థానిక పీపల్‌ట్రీ పాఠశాల, భవిత కేంద్రంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. పీపల్‌ట్రీ పాఠశాలలో విద్యార్థి లలిత్‌కుమార్ వేసిన హరిదాసు వేషం అకట్టుకుంది. కోలాటాలు, భోగిమంటలు, ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి ఆటపాటలతో అలరించారు. సంప్రదాయ దుస్తులు ధరించి పల్లెలో జరిగే పండగను తలపించారు. అలాగే దివ్యాంగుల కేంద్రం భవితలో ఎంఈఓ రెడ్డిశేఖర్, హెచ్ఎం అంజద్‌అలీఖాన్, సీఆర్పీ సురేష్, సిబ్బంది సంక్రాంతి పండుగ వేడుక నిర్వహించారు. గోవుకు పూజలు చేశారు. ముగ్గులు, తోరణాలు, గొబ్బెమ్మలతో సందడి చేశారు.

అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు

గుర్రంకొండ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు తహసీల్దార్ ఖాజాబీకి వినతి పత్రం సమర్పించారు. మంగళవారం వారంతా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలను వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీసవేతనం కింద రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలన్నారు. సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 5 లక్షలు చెల్లించాలన్నారు. సూపర్‌వైజర్ పోస్టుల్లో వయోపరిమితి తొలగించి, హెల్పర్ల ప్రమోషన్ల వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ, రెడ్డెమ్మ, రెడ్డిరాణి, మంజుల, అనసూయ, రెడ్డిబూ, తులసి, విజయకుమారి పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో స్వర్ణ పతకాలు

మదనపల్లె సిటీ : స్కై మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి పోటీల్లో మదనపల్లె పట్టణం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిని పి.సంహిత రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన 23వ జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సంహిత పాల్గొంది. రెండు విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు మంగళవారం కాలేజీలో డైరెక్టర్ రామలింగారెడ్డి,చైర్మన్ రామమోహన్‌రెడ్డి,ప్రిన్సిపాల్ సతీష్‌లు సంహితను అభినందించారు.

అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించాలి

కేవీపల్లె : గ్రామ పంచాయతీల అభివృద్ధిపై పారదర్శకంగా ప్రణాళికలు రూపొందించాలని ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు పంచాయతీ నిధులు ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం



అభ్యంతరాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రవి

పీలేరు రూరల్ : రైతులకు జగనన్న భూహక్కు పత్రాల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ రవి అన్నారు. మంగళవారం మండలంలోని ఆవులవారిపల్లె, మద్దెలచెరువుపాళెంకు సంబంధించి 54 మంది రైతులకు జగనన్న శాశ్విత భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూముల విస్తీర్ణం, సరిహద్దుల్లో వచ్చి తేడాలపై పలువురు రైతులు తమ అభ్యంతరాలు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వో శాంతకుమార్‌రెడ్డి, నాయకులు లోకనాథరెడ్డి, చెంగల్‌రాయుడు, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.